క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీరామ ఆదుద్దారణ హోమం



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయం ఆవరణలో శ్రీరామ ఆదుద్దారణ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు సుదర్శనాచారి తదితరుల మంత్రోచ్ఛరణల మధ్య దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు దంపతులు, ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు



లింగాల: మండల అటవీ శాఖ రేంజ్ పరిధిలోని నక్కినోని గండి ప్రాంతంలో ఆదివారం పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎఫ్ఆర్ఓ వీరేషం ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తామని ఎఫ్ఆర్ఓ తెలిపారు. వేసవికాలం కావడంతో వన్య ప్రాణులు బహిరంగ ప్రదేశాలకు వచ్చే అవకాశాలు ఉంటాయని ఆవులు, గేదెలు, మేకలు తదితర వాటిని మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లొద్దని కోరారు. కార్యక్రమంలో డీఆర్ఓ జయదేవ్, బీట్ ఆఫీసర్లు ఖాదర్‌పాషా, నాగార్జునగౌడ్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గురువుకు ఆర్థికసాయం



కల్వకుర్తి: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన తిరుపతి రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 2006వ సంవత్సరంలో 10 తరగతి చదివిన విద్యార్థులు ఉపాధ్యాయుడి పరిస్థితి తెలుసుకొని ఆర్థికసాయం అందించేందుకు ముందుకువచ్చారు. ఒకరికొకరు డబ్బులు పోగు చేసుకొని మొత్తం రూ. 41 వేలు గురువుకు అందజేశారు. కార్యక్రమంలో శరత్, జనార్దన్, మల్లేష్, హిమాయత్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



చారకొండ: ఇటీవల మృతి చెందిన దాసర్ల కల్పన కుటుంబానికి అండగా ఉంటామని సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి రాములు యాదవ్ అన్నారు. మండలంలోని జూపల్లిలో సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. గ్రామస్తులు రియాజ్, తాజు, జమీర్, మహ్మద్ తదితరులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



తెలకపల్లి: మండల కేంద్రంలోని కేకేరెడ్డి పాఠశాలలో సోమవారం వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపాల్ బాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు అనుభవం కలిగిన స్వర్ణ భారతి కళానిలయం ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కూచిపూడి, శాస్త్రీయనృత్యం, జానపద పాశ్చాత్య నృత్యాలతోపాటు, లలిత జానపద సంగీతం, కీబోర్డు, తబల, డోలక్, డప్పు, కాంగో, రితం, ప్యాడ్ సంగీతం వాయిద్యాలలో శిక్షణ ఉంటుందని వివరించారు. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పక్కా భవనాలు ఏవి?



నిలిచిన ఇందిరాక్రాంతిపథం కార్యాలయం నిర్మాణ పనులు



అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

కోడేరు: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లోని ఇరుకు గదుల్లో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. శాఖలకు సంబంధించిన రికార్డులను ఎక్కడ భద్రపరుచుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇందిరా క్రాంతి పథం(వెలుగు) కార్యాలయం కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. మండలం ఏర్పాటు అయినా తహసీల్దార్ కార్యాలయం కూడా అద్దె భవనంలో లోనే విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా అధికారులు కార్యాలయానికి పంపించే విలువైన సామగ్రి భద్రపరిచేందుకు అవసరమైన గదులు లేవు. వెలుగు కార్యాలయానికి గ్రామాల నుంచి వచ్చే గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించేందుకు అనువైన గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పశువైద్యశాల, బీసీ హాస్టల్‌లకు ప్రభుత్వ భవనాలు లేవు. అధికారుల అలసత్వం వల్ల ప్రభుత్వ భవనాల నిర్మాణానికి మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

నిధులు మంజూరైనా..

ఐకేపీ భవన నిర్మాణానికి ఎనిమిది ఏళ్ల కిందట రూ. 30 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్లాబు వేసి చుట్టూ గోడలు వరకు నిర్మించి వదిలేశారు. కోర్టు పరిధిలో ఉండటంతో భవనం నిర్మాణం పనులు నిలిచిపోయాయి. తహసీల్దార్ కార్యాలయానికి గత సంవత్సరం డిసెంబర్‌లో రూ.1.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 3 నెలల కిందట పనులకు శంకుస్థాపనకే పరిమితం అయ్యింది. తహసీల్దార్ కార్యాలయం అనువైన చోట నిర్మాణం చేపట్టడంలేదని గ్రామస్తులు పనులు నిలిపివేశారని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యల చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. పాలన పరంగా అధికారులకు, వివిధ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ భవనం ఉంటే అధికారులు సమావేశాలు నిర్వహణకు, సామగ్రి భద్రపర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పి.రవి, సీపీఎం మండల కార్యదర్శి, కోడేరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించే విషయంపై పూర్తి వివరాలు సేకరిస్తాం. ఏఏ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు అవసరమో నివేదిక రూపొందిస్తాం. నిధులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తా. త్వరలోనే పక్కా భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– శ్రీనివాసులు. ఎంపీడీఓ, కోడేరు

సమన్వయంతోనే అభివృద్ధి



ఏఈ సందీప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే అభివృద్ధి పనులు, పురోగతిపై సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, విద్యుత్, అమ్రాబాద్ ఆస్పత్రి వైద్యసేవలపై సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మండలానికి రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసులు, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, ఎంపీడీఓ మోహన్‌లాల్ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఊర్కొండ మండలం మాదారంలో కూలీలతో మాట్లాడుతున్న అధికారులు



చెన్నంపల్లి పూడకితీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఊర్కొండ: మండలంలోని మాదారం గ్రామ పంచాయతీని, ఉపాధి పనులను చెరువు పూడికతీత పనులను సోమవారం ఎంపీడీఓ విజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేసే పని ప్రదేశాల వద్ద తాగునీటి, నీడ వసతి కల్పించాలని సూచించారు. ఉపాధి పనులకు కూలీల సంఖ్య 200 మందికి పెంచాలని కోరారు. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీలలో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నిర్వాహకులక పలు జాగ్రత్తలను వివరించారు. ఏపీఓ వెంకటేష్ కార్యదర్శి వాణి పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని సూరాపూర్, చెన్నంపల్లి శివారు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. భూమి చదును, పొలాలకు ఒండ్రుమట్టి తరలింపు, నర్సరీల ఏర్పాటును తదితర పనులను ఎంపీడీఓ పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఏపీఓ ఇమాంఅలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కను పట్టుకునేందుకు పాట్లు

- మున్సిపల్ అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న శునకం

అచ్చంపేట రూరల్: ఐదు రోజుల కిందట 20 మందిని ఓ వీధి కుక్క దాడి చేసి కరిచిన ఘటన విధితమే. దీంతో మున్సిపల్ అధికారులు కుక్కలను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కుక్కలు దాడులు చేస్తే తప్పా అధికారులు నిద్రమత్తు వీడటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు, సిబ్బంది వీధి కుక్కల వెంటపడి పట్టుకుంటున్నారు. రెండు రోజుల నుంచి వీధులలో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని ఆటోలలో సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కుక్కల కోసం అన్నీ వీధులు, కాలనీల్లో తిరుగుతున్నారు. ఓ పక్క సిబ్బంది కుక్కలను పట్టుకుంటున్నా.. మరో పక్క కుక్కలు దాడి చేస్తూనే ఉన్నాయి. తాజాగా ఆదివారం ఓ మహిళపై కుక్క దాడి చేసి గాయపర్చింది. కుక్కల దాడులు తరుచుగా వెలుగు చూస్తున్నాయి.

కరిచిన కుక్కను పట్టుకోలే..!

పట్టణంలోని టీచర్స్‌కాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీల్లో 20 మందిని కరిచిన కుక్క మళ్లీ కాలనీలో తచ్చాడుతూ కన్పిస్తోందని కాలనీవాసులు చెబుతున్నారు. అసలు కుక్కను పట్టుకోకుండా ఇతర వీధి కుక్కలను పట్టుకుంటున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. 20 మందికి పైగా కరిచిన నల్లకుక్కగా కాలనీవాసులు గుర్తించారు. ఈ కుక్కను పట్టుకునేందుకు అధికారులు, సిబ్బంది ముప్పుతిప్పలు పడుతున్నారు.



కాలనీలో తిరుగుతున్న కరిచిన కుక్క

కుక్కల పట్టివేతను అడ్డుకున్న బ్లూక్రాస్ సొసైటీ సభ్యురాలు

పట్టణంలో వీధి కుక్కలను పట్టుకుంటున్నారని విషయం తెలుసుకున్న బ్లూక్రాస్ సొసైటీ సభ్యురాలు సోమవారం కుక్కల పట్టివేతను అడ్డుకున్నారు. ఈ విషయం సొసైటీ నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారు మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మొత్తంగా సోమవారం పట్టుకున్న కుక్కలను సొసైటీ సభ్యురాలి ఎదుటనే వదిలేసినట్లు సమాచారం. మొత్తంగా ఈ వీధి కుక్కల సమస్య మున్సిపల్ అధికారులకు తలనొప్పిగా మారింది.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో సోమవారం ఓ పంచాయతీ విషయంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం తాడూరుకు చెందిన అన్నా చెల్లెలు పంచాయతీ విషయంలో ఒక వర్గం అరెకంటి సాయిరాంతోపాటు ఏడుమంది, మరో వర్గం ఒగ్గు మల్లేష్‌తోపాటు ఆరుమంది ఒకరికొకరు మాటమాట అనుకొని ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో మొత్తం 15 మందిపై కేసు నమోదైంది. బ్లూకోట్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ భానుప్రకాష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం



కోడేరు: మండల కేంద్రానికి చెందిన బాలస్వామి నెల రోజుల కిందట మృతిచెందగా అతని భార్య రేణుక రెండేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయింది. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్నా రేమద్దుల ఫ్రెండ్స్ యూత్ సభ్యులు గిరిబాబు, రాజావర్ధన్, శివలు కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్‌కరీం, ఎంపీటీసీ గడ్డం నరసింహ సమక్షంలో అనాథ పిల్లలకు రూ.12 వేలు ఆర్థిక సాయం, కొత్త దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, పరమేష్, గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



తాడూరు: నెల రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రం నుంచి గుంతకోడూరు మీదుగా మేడిపూర్‌కు వెళ్లే మిషన్ భగీరథ పైపులైన్ గుంతకోడూరు సమీపంలో లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. భగీరథ పైపులైన్ లీకేజీతో నీటి సరఫరాలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు అధికారులకు తెలియజేసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. లీకేజీ అయిన నీటితో పచ్చి గడ్డి, జమ్ము పెరిగింది. నీరు కలుషితం అయ్యి పైపులైన్‌లోకి చేరుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

కొల్లాపూర్: రెండో విడత గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని యాదవ సంఘం నాయకులు బింగిసాయన్న యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారుల నుంచి డీడీలు సేకరించిందన్నారు. కానీ ఇప్పటివరకు గొర్రెల పంపిణీ చేపట్టలేదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పందించాలన్నారు. లబ్ధిదారులందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటస్వామి, రాముడు ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కోడేరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



కల్వకుర్తిలో

కోడేరు: ఎంపీ అభ్యర్థి పొంతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని బీజేపీ మండల నాయకులు భాలపీరు, రామకృష్ణ కోరారు. సోమవారం మండల కేంద్రంతో పాటు నాగులపల్లి, తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా 12వ వార్డు కౌన్సిలర్ రాఘవేందర్‌గౌడ్, 22వ వార్డు పరిధిలో దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ గ్యారంటీ కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నర్సింహ, నరేష్‌గౌడ్, శ్రీకాంత్, శివరామకృష్ణ, కిరణ్, కౌశిక్, శివ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కమలం గుర్తుపై ఓటు వేసి భరత్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు భరత్, అంజి యాదవ్, చరణ్, సత్యప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతి తీరని లోటు



పాస్టర్ సామ్యూల్‌కు నివాళి అర్పిస్తున్న చిన్నారులు

బిజినేపల్లి : మండలంలో క్రైస్తవ సంఘాన్ని స్థాపించిన సీనియర్ పాస్టర్ బీఎస్ సామ్యూల్ మృతి తీరని లోటు అని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకులు డా. కేవీ పాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ సామ్యూల్ 77 సంవత్సరాలుగా దేవుడి సేవకుడికి పని చేశారన్నారు. ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎంఆర్ సుందర్ పాల్, జాన్ బుచ్చయ్య, పాల్ రాజ్, ఐజాక్, జయరాజ్, పరంజ్యోతి, వేదాంతి, తిమెతి, కృపానందం, జాన్ మెజెస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తోనే దృఢమైన నిర్మాణాలు

బిజినేపల్లి: భవన నిర్మాణ రంగంలో నాణ్యమైన నిర్మాణాలకు భారతి సిమెంటు పెట్టింది పేరని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సునీల్ అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని వినాయక ట్రేడర్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌ల కన్నా భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌పై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. వినియోగదారులకు స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ సహకారాలు, సూచనలు ఇస్తారని వివరించారు. యాదాద్రి దేవాలయ నిర్మాణానికి, ఆలేరు వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్‌పై ఫ్లైఓవర్ నిర్మాణానికి భారతి సిమెంట్‌ను వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.



మేస్త్రీలకు ప్రమాదబీమా పత్రాలు అందిస్తున్న భారతి సిమెంట్ అధికారులు

అనంతరం 60 మంది మేస్త్రీలకు ఉచితంగా రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ విజయ్‌బాబు, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, వినాయక ట్రేడర్స్ డీలర్ నితీన్, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

అమ్రాబాద్: ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సరిత హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో హోమ్ ఓటింగ్‌పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 8 వతేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల హోమ్ ఓటింగ్ నిర్వహిస్తునట్లు ఆమె తెలిపారు. 85 నుంచి పైబడి సంవత్సరాల వారిని సిబ్బంది హోమ్ ఓటింగ్ కోసం గ్రామాలకు వస్తారని పేర్కొన్నారు. పారదర్శకంగా ఓటు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

నిందితుడికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: ఈనెల 22న జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట పుట్‌పాత్ వ్యాపారుల దుకాణాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి కారణమైన నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీకి చెందిన అన్వర్ అవసర నిమిత్తం అతని మామ ఖాజాను రూ.50 అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 22న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట కొబ్బరబొండాలు దుకాణం నిర్వహిస్తున్న ఖాజా దుకాణానికి నిప్పంటించాడు. అగ్నిప్రమాదంలో నాలుగు దుకాణాలు దగ్ధమై రూ. 10 లక్షలు ఆస్తి నష్టం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు అన్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఆయనను కలిసి సమస్యలు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని ఆశీర్వదించి గెలిపించాలని వారిని కోరారు. ఆయనను కలిసిన వారిలో బలుస శ్రీరాములు, తిరుపతయ్య, బాలగౌడ్, రమేష్, స్వామి, గణేష్, నర్సింహ, సత్యనారాయణ, మోహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ భవనం తలుపులకు నిప్పు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం కార్యాలయం తలుపులకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అదేసమయంలో పాఠశాల మైదానం నుంచి వెళ్తున్న గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎమ్మార్సీ కార్యాలయానికి రెండు గంటల సమయంలో సిబ్బంది తాళం వేసి వెళ్లారు. సాయంత్రం పాఠశాల గ్రౌండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి మత్తులో తలుపులకు నిప్పు పెట్టి వెళ్లారు. పొగ రావడాన్ని గమనించిన స్థానికులు మండల విద్యావనరుల అధికారికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సకాలంలో ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. కార్యాలయంలో ఉన్న రికార్డులు, సామగ్రికి భద్రంగా ఉన్నాయి. ఎలాంటి ఆస్తినష్టం జరుగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కాలిన విద్యా వనరుల కేంద్రం కార్యాలయం తలుపులు